క్లుప్తంగా

బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ విద్యార్థులకు ర్యాంకులతో సంబంధం లేకుండా పూర్తి ఫీజును చెల్లించాలించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ బకాయిలను విడుదల చేయాలని శనివారం బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు. బీటెక్ ఫీజు రూ.45 వేల నుంచి రూ.1.60 లక్షలు ఉండగా బీసీలకు ప్రభుత్వం కేవలం రూ.35 వేలు మాత్రమే చెల్లిస్తుందన్నారు. కోర్సులు పూర్తయినా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో కాలేజీల యజమానులు డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వందలాది మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని వినతిలో పేర్కొన్నారు.

29న పీజీ సీట్లు సాధించిన విద్యార్థుల జాబితా విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ వర్సిటీలలో పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు మొదటి విడత కౌన్సెలింగ్‌లో భాగంగా రిజిస్ట్రేషన్ గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్లు కన్వీనర్ ప్రొ.పాండురంగా రెడ్డి తెలిపారు. ఈ నెల 23 నుంచి 29 వరకు వెబ్ ఆప్షన్లు, 26న ఎడిటింగ్, 29న సీటు సాధించిన విద్యార్థుల తొలి జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. సీటు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో వచ్చే నెల 4 వరకు జాయినింగ్ రిపోర్టు ఇవ్వాలన్నారు. శనివారం వరకు 30,100 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు వివరించారు.

నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి

అమీర్‌పేట: ప్రతి వ్యక్తి నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని రాయల సేవాసమితి వ్యవస్థాపకులు ఆర్.సి.కుమార్ అన్నారు.అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఉపాధ్యాయులకు 'మోరల్ ఎతిక్స్' సంబంధించిన పుస్తకాలను అందజేసి మాట్లాడారు. నేటి ఆధునిక యుగంలో మనుషుల మధ్య గౌరవ మర్యాదలు కొరవడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుత తరుణంలో విద్యార్థులకు నైతిక విలువలు, క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాల్సిన అవసరం అధ్యాపకులపై ఉందన్నారు. అమరేశ్వరి, నాగరేఖ, విజయశ్రీ,మాగ్నెస్ దయాగ్నస్టిక్స్ నిర్వాహకులు డాక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీల కలకలం

రసూల్‌పురా: సికింద్రాబాద్ పరేడ్ మైదానం పరిసరాల్లో శనివారం బీజేపీకి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వెలిసిన ఫ్లెక్సీలు కలకలం రేపాయి. తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా పరేడ్ మైదానంలో జరగనున్న సభలో నేడు (ఆదివారం) కేంద్ర హోం మంత్రి అమిత్‌షా పాల్గొన నున్న తరుణంలో ఫ్లెక్సీలు వెలిసాయి. పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఎందుకు ఇవ్వలేదు.. గోవా రాష్ట్రానికి మూడూ వందల కోట్లు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నిధులు ఎక్కడ.. విమోచన దినోత్సవ సభలో తెలంగాణకు నిధులు అమిత్‌షా ప్రకటిస్తారా అని ప్రశ్నిస్తూ గుర్తు తెలియని వ్యక్తులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

పార్కును ఆధునీకరిస్తాం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ పార్కును అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి పనులు చురుకుగా సాగుతున్నాయని జీహెచ్‌ఎంసీ ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ చెప్పారు. శనివారం మేనేజర్ గణేష్, కాంట్రాక్టర్‌తో కలిసి ఆయన పార్కును సందర్శించి మాట్లాడారు. స్థానిక ప్రజలు హాయిగా వాకింగ్, యోగా ఇతరత్రా వ్యాయామాలు చేసుకోడానికి పార్కులో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నామన్నారు. పార్కులో అందమైన పూల మొక్కలు, పచ్చదనం, ల్యాన్ ఇతరత్రా పనులను చేపడుతున్నామన్నారు. పార్కులో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో పార్కును తెరిచే వేళల్లో మార్పులు చేసినట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రణవీర్ ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని రోజుల పాటు ఉదయం 5 గంటల నుంచి 9.30 వరకు, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 వరకు పార్కు తెరిచి ఉంటుందన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులు, సెక్యూరిటీ సిబ్బంది వాగ్వాదం

పరస్పర ఫిర్యాదులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, అడ్డుకున్న సెక్యూరిటీ సిబ్బంది పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. శనివారం యూనివర్సిటీలో పెన్‌డౌన్..చాక్‌డౌన్ నిరసనలో భాగంగా ధర్నా కోసం తీసుకొస్తున్న టెంట్ సామగ్రిని ఎన్‌సీసీ వద్ద (ఓయూ ప్రవేశ ద్వారం) సెక్యూరిటీ గార్డులు అడ్డుకోవడంతో ఇరువురికి వాగ్వాదం జరిగింది.సెక్యూరిటీ సిబ్బంది వెంటనే కాంట్రాక్టు అధ్యాపకుల ముఖ్య నాయకులు విజయేందర్‌రెడ్డి, వేల్పుల కుమార్ తదితరులపై ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సెక్యూరిటీ సిబ్బంది దౌర్జన్యం చేశారని అధ్యాపకులూ సైతం వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా ఔటా ఉపాధ్యక్షులు మల్లేశం, కోశాధికారి చలమల్ల వెంకటేశ్వర్లు ధర్నాకు సంఘీభావం తెలిపి కాంట్రాక్టు అధ్యాపకులను పర్మనెంట్ చేయడంతోనే ప్రభుత్వ వర్సిటీలు బలోపేతం అవుతాయన్నారు.

అడుగుకో గుంత.. వెళ్లేదెట్టా

- ధ్వంసమైన రోడ్లు
- రాకపోకలకు ఇబ్బందులు
- మరమ్మతులు చేయాలంటున్న వాహనదారులు
- విస్మరిస్తున్న అధికారులు


పద్మారావునగర్ ధ్వంసమైన రోడ్డు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లోని రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయని వాహనదారులు, పాదచారులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరికొన్ని రోడ్లు, గుంతమయంగా కంకర తేలడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. క్షేత్రస్థాయిలో రోడ్ల పరిస్థితిని తెలుసుకొని ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సిన సదరు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

ప్రతి సర్కిల్ పరిధిలో తాత్కాలిక ఎమర్జెన్సీ వాహనాలు ఏర్పాటు చేశారు. సదరు వాహనంలో సిబ్బంది ఆయా ప్రాంతాల్లో పర్యటించి గుంతలమయంగా మారిన రోడ్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేయాలి. అయితే ఆచరణలో సదరు సిబ్బంది ఆ స్థాయిలో పని చేయడం లేదనేది వాస్తవం. సదరు ప్రైవేట్ ఎమర్జెన్సీ వాహనాలపై జీహెచ్‌ఎంసీ ఏటా లక్షల్లో ఖర్చు చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం ఆ స్థాయిలో పని జరగడం లేదని స్పష్టంగా కనిపిస్తోంది.

వర్షాలకు ధ్వంసమైన రోడ్లు ఇవే..

- పద్మారావునగర్ పార్కు పక్కన రోడ్డు దుస్థితి దయనీయంగా ఉంది. చాలా కాలం నుంచి ఈ రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే ప్రజలు, వాహనచోదకులు నిత్యం నరకం చూస్తున్నారు. వర్షానికి పెద్ద ఎత్తున వరదనీరు ఇక్కడ నిలిచిపోవడంతో రాకపోకలు సాగించడం కష్టంగా మారుతుంది.
- బన్సీలాల్‌పేట్ గొల్లకొమురయ్య కాలనీ వెనుకాల గాంధీనగర్ కాలనీకి వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది.
- చాచానెహ్రూనగర్ ప్రాంతంలో ఇంటర్నల్ రోడ్ల పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా నడుచుకుంటూ వెళ్లే వృద్ధులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలు కనబడగా ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రాణిగంజ్, మోండా మార్కెట్, బోయిగూడ, బన్సీలాల్‌పేట్ తదితర ప్రాంతాల్లోని ఇంటర్నల్ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి.

మరమ్మతులు చేస్తున్నాం..

సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో రోడ్ల బాగు కోసం చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైన రోడ్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నాం. ఇంకా ఎక్కడైనా ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే మరమ్మతులు చేస్తాం. గతంతో పోల్చుకుంటే ఇటీవల రోడ్లు ఎంతో అభివృద్ధి చెందాయి. ఎళ్ల తరబడి వరకు రోడ్లు చెక్కుచెదరకుండా ఉండేందుకు వీడీసీసీ రోడ్లు వేస్తున్నాం

సుదర్శన్, జీహెచ్‌ఎంసీ ఈఈ బేగంపేట్ సర్కిల్

జెక్‌కాలనీ అభివృద్ధికి సహకరిస్తా

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్


ఆర్చిని ప్రారంభించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: జెక్‌కాలనీ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గ్రీన్‌సిటీ అధినేత, బల్కంపేట ఎల్లమ్మ-పోచమ్మ దేవస్థానం బోర్డు సభ్యుడు కొండ్రాజు సుబ్బరాజు తన సొంత ఖర్చుతో జెక్‌కాలనీ గాంధీ విగ్రహం వద్ద నిర్మించిన ఆర్చిని శనివారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. కాలనీ ముఖద్వారంలో నిర్మించిన భారీ ఆర్చి కాలనీకే ఆకర్షణీయంగా ఉందన్నారు. ఆర్చి నిర్మాణానికి ముందుకొచ్చిన సుబ్బరాజు, రమణమ్మ దంపతులను అభినందించారు. జెక్‌కాలనీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి తాను ప్రజా సమస్యలను పరిష్కరించిన విషయాన్ని గుర్తు చేశారు. కాలనీలో పార్కును కూడా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, జెక్‌కాలనీ అధ్యక్షులు జి.సూర్యశంకర్‌రెడ్డి, సెక్రటరీ మల్లు ప్రసాద్, ట్రెజరర్ శివారెడ్డి, సురేందర్ రాజు, శ్రీనివాసరాజు, మహేశ్వర్‌రెడ్డి, సురేష్‌గౌడ్, చక్రధర్‌యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డిలతో పాటు నాయకులు కొలను బాల్‌రెడ్డి, సరాఫ్ సంతోష్, అశోక్ యాదవ్, ఉమానాథ్‌గౌడ్, అంజనేయులుయాదవ్, పుష్పలత, ఝాన్సీ పాల్గొన్నారు.

కైలాష్‌నగర్‌లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం..

సనత్‌నగర్ డివిజన్‌లోని కైలాష్‌నగర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం రూ.3.30 కోట్లు మంజూరైనట్లు మంత్రి ప్రకటించారు. పేద, మధ్యతరగతి ప్రజలు పలు వివిధ కార్యక్రమాలు నిర్వహించుకోవడం కోసం ప్రైవేటు ఫంక్షన్‌హాళ్లకు లక్షలాది రూపాయల అద్దె చెల్లించాల్సి వస్తుందని, అది ఆర్థికంగా ఎంతో భారంగా మారుతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్లను నిర్మాణం చేపడుతున్నామన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



అమీర్‌పేట: రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దత్తత తీసుకున్న అమీర్‌పేట ప్రభుత్వ హైస్కూల్ అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి అన్నారు. మంత్రి కొనుగోలు చేసిన క్రీడా సామాగ్రిని శనివారం విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. కోట్ల రూపాయలు వెచ్చించి క్రీడా మైదానాలను సైతం అభివృద్ధి చేశారన్నారు. మంత్రి అందించిన క్రీడా సామగ్రిని సద్వినియోగం చేసుకుని క్రీడల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధు, బీఆర్ఎస్ నాయకులు హనుమంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సీపీఆర్‌పై అవగాహన అవసరం

సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్


మహేష్ భగవత్‌ను సత్కరిస్తున్న డాక్టర్ భాస్కర్‌రావు

రాంగోపాల్‌పేట్: బహిరంగ ప్రదేశాల్లో గుండెపోటు వచ్చిన వారి ప్రాణాలు కాపాడటంలో పోలీసులు కూడా కీలక పాత్ర పోషిస్తారని సీఐడీ అదనపు డైరెక్టర్ జనరల్ మహేష్ భగవత్ అన్నారు. శనివారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో సీఐడీ పోలీసులకు సీపీఆర్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిత్యం బహిరంగ ప్రదేశాల్లో పోలీసులు విధి నిర్వహణలో ఉంటారని సీపీఆర్‌పై అవగాహన ఉంటే ఎవరికైనా గుండెపోటు వస్తే సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందన్నారు. పోలీసుల పాత్రను గుర్తించి వారికి అవగాహన శిబిరాన్ని ఏర్పాటు చేయడంపై ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులను అభినందించారు. కిమ్స్ ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్టు, కోర్సు డైరెక్టర్ హయగ్రీవ రావు మాట్లాడుతూ.. మన దేశంలో ప్రతి ఏటా సుమారు 7లక్షల మంది గుండెపోటుతో మరణిస్తున్నారని ఈ సంఖ్య ఇంకా పెరుగుతూనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గుండెపోటు వచ్చినప్పుడు సీపీఆర్ చేస్తే వాళ్లు బతికే అవకాశాలు 30 శాతం పెరుగుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఎండీ డాక్టర్ భాస్కర్‌రావు, క్రిటికల్ కేర్ విభాగాధిపతి డాక్టర్ సంబిత్ సాహూ పాల్గొన్నారు.

ఘన స్వాగతం


శివకుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సాయిబాబా

చిలకలగూడ: కర్నాటక ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను సికింద్రాబాద్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నాగులూరి సాయిబాబా శనివారం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. తుక్కుగూడ విజయభేరి సభను విజయవంతం చేసేందుకు సికింద్రాబాద్ నుంచి పెద్దసంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు సాయిబాబా తెలిపారు.

24న మిసెస్ ఇండియా తెలంగాణ ఫ్యాషన్ షో


మిసెస్ ఇండియా తెలంగాణ కిరీటాన్ని ఆవిష్కరించిన మోడళ్లు

సనత్‌నగర్: మిసెస్ ఇండియా తెలంగాణ ఫ్యాషన్ షో గ్రాండ్ ఫినాలే పోటీలను ఈ నెల 24న నోవాటెల్ హోటల్‌లో నిర్వహించనున్నారు. శనివారం బేగంపేటలోని ఫ్యామిలీ వరల్డ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మిసెస్ ఇండియా తెలంగాణ కిరీటాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బ్రాండ్ అంబాసిడర్ మమతా త్రివేది మాట్లాడుతూ.. చేనేత కార్మికులకు మద్దతుగా నిలిచి వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోచంపల్లి ఇక్కత్‌లో సృజనాత్మకంగా అలంకరించబడిన గ్రాండ్ ఫినాలే మోడల్స్ ర్యాంప్ వాక్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన నేచురల్స్ సీఓఓ అరవింద్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళా సాధికారతతో సమాజాభివృద్ధి చెందుతుందన్నారు. 2020 నుంచి తాము మిసెస్ ఇండియా తెలంగాణతో భాగస్వామిగా నిలవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశక్తి ఎడ్యుకేషనల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పింజల, రోహిత్‌గుప్తా, యాషికా మెహతా, డాక్టర్ కల్పన పాల్గొన్నారు.

పనుల జాప్యంపై డిప్యూటీ స్పీకర్ ఆగ్రహం

వెంటనే పూర్తి చేయాలని ఆదేశం

సాక్షి ఎఫెక్ట్..

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్‌లోని జలమండలి కార్యాలయం మీదుగా టీఆర్‌టీ క్వార్టర్స్‌కు వెళ్లే రహదారి నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్‌తో పాటు స్థానిక నాయకుల పనితీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండరు ప్రక్రియ పూర్తయి, నిధులు మంజూరు కావడంతో నూతన రోడ్డు ఏర్పాటు చేసేందుకు సీతాఫల్‌మండి ప్రధాన రహదారి సురేష్ థియేటర్ ఎదురుగా టీఆర్‌టీ క్వార్టర్స్‌కు వెళ్లే రహదారిని కొన్ని నెలల క్రితం తవ్వేశారు. గుత్తేదారు, ఇంజనీర్లు, నాయకుల నిర్లక్ష్యంతో నిర్మాణపనులు పలుమార్లు వాయిదా పడడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై 'రోడ్డు నిర్మాణంలో జాప్యం.. జనాగ్రహం' అనే శీర్షికతో శనివారం 'సాక్షి' ప్రచురితమైన కథనానికి డిప్యూటీ స్పీకర్ స్పందించారు. జీహెచ్‌ఎంసీ ఇంజనీరు కౌషిక్, కాంట్రాక్టర్ శ్యామ్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో తానెప్పుడూ ముందుంటానని పద్మారావుగౌడ్ స్పష్టం చేశారు.

పిల్లలకు ఇచ్చే ఆస్తి చదువు మాత్రమే

పద్మారావునగర్: పేద కుటుంబాలు తమ పిల్లలను బాగా చదివించాలని, వారికి మీరిచ్చే ఆస్తి చదువు మాత్రమేనని టాలెంట్ స్ప్రింట్ డైరెక్టర్ వి.స్ఫూర్తి అన్నారు. భోలక్‌పూర్ క్రిష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేసి మాట్లాడారు. చదువే మీ జీవితాలను మారుస్తోందని ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా చదువును మాత్రం వీడొద్దని సూచించారు. ప్రతి ఏడాది ఈ పాఠశాల విద్యార్థులకు టై, బెల్టులు, గుర్తింపు కార్డులను ఇస్తానని స్ఫూర్తి పేర్కొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలు అందజేసిన స్ఫూర్తి

తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ అధ్యక్షుడిగా శ్రవణ్‌కుమార్


శ్రవణ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

చిలకలగూడ : తెలంగాణ ప్రదేశ్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ అధ్యక్షుడిగా చిలకలగూడకు చెందిన తెల్ల శ్రవణ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆల్ ఇండియా కాంగ్రెస్ సేవాదళ్ చీఫ్ ఆర్గనైజర్ లాల్‌దేశాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. సేవాదళ్ కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో తెలంగాణ సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్, ఇన్‌చార్జి సంగ్రామ్ తవాడియా నియామక ఉత్తర్వులను శ్రవణ్‌కుమార్‌కు అందించారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని, రానున్న ఎన్నికల్లో తెలంగాణతో పాటు సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని శ్రవణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు.

ఐఏఎస్ అధికారిణికి ఇబ్బందులు కలిగిస్తున్న వ్యక్తిపై కేసు

రాంగోపాల్‌పేట్: ఓ మహిళా ఐఏఎస్ అధికారిణి కార్యాలయానికి వెళ్లి ఇబ్బందులు కలిగిస్తూ వేధింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఓ ప్రభుత్వ సంస్థలో ఐఏఎస్ అధికారిణి డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శివప్రసాద్ అనే వ్యక్తి సదరు అధికారిణిని కలిసేందుకు ఆమె కార్యాలయానికి వస్తున్నాడు. అలాగే సామాజిక మాధ్యమాల్లోనూ ఆమెను అనుసరిస్తున్నాడు. రోజూ మధ్యాహ్న భోజన విరామ సమయంలో వచ్చి మేడంకు అభిమానినంటూ చెబుతుండటం అధికారిణి గమనించి అతన్ని లోపలికి అనుమతించవద్దని సిబ్బందిని ఆదేశించారు. సదరు వ్యక్తి ఆమె ఇంటి చిరునామా తెలుసుకుని ఈ నెల 12న అక్కడికెళ్లి కలిసేది ఉందని సిబ్బందితో చెప్పడంతో పాటు స్వీట్ బాక్సు ఇవ్వాలని కోరడంతో అతన్ని అక్కడి నుంచి పంపించి వేశారు. రోజూ ఇలాగే చేస్తుండటంతో అదే కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ ఫిర్యాదు మేరకు శివప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. అయితే ఆ వ్యక్తిని మార్కెట్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితుడు వివిధ రకాల అనారోగ్యంతో బాధ పడుతున్నట్లు, మానసిక శారీరక పరిస్థితి సరిగా లేదని పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

స్థానిక పరిపాలనతోనే వినియోగదారులకు మేలు


మాట్లాడుతున్న సత్యనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ: స్థానిక సుపరిపాలనతోనే అట్టడుగు వినియోగదారులకు మేలు జరుగుతుందని రియల్ ఎస్టేట్ రెగ్యులరిటీస్ అథారిటీ (రెరా) చైర్మన్, ఐఏఎస్ అధికారి డాక్టర్ సత్యనారాయణ అన్నారు. ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రం కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ప్రకాశం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ స్టడీస్ ట్రస్ట్ (పీఐడీఎస్‌టీ) ఆధ్వర్యంలో లోకల్ గవర్నెన్స్ ఈస్ గుడ్ గవర్నెన్స్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. పీఐడీఎస్‌టీ ప్రధాన కార్యదర్శి, టంగుటూరి ప్రకాశం పంతులు వంశీయులు టంగుటూరి శ్రీరామ్ మాట్లాడుతూ.. పరిపాలన వికేంద్రీకరణకు ఆద్యుడు ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వారి హయాంలో ఫీర్కా అభివృద్ధి కేంద్రాన్ని అమలు చేశారని వివరించారు.సదస్సులో డాక్టర్ మోహన్‌రావు, ప్యాట్రన్ రాంచందర్‌రావు మహారాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ.వాయునందన్, జాయింట్ సెక్రెటరీ టి.రాజశేఖర్, మెంబర్ నిరంజన్ దేశాయ్ ప్రసంగించారు.

నగర యువతికి నైజీరియన్ బురిడీ!

- పెళ్లి చేసుకుంటానని నమ్మించి సైబర్ మోసం
- రూ.27.43 లక్షలు స్వాహా

రాంగోపాల్‌పేట్: మ్యాట్రిమోనీలో తప్పుడు ప్రకటనలు ఇస్తూ పెళ్లి పేరిట యువతులను మోసగిస్తున్న నైజీరియన్‌ను పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 5 మొబైల్ ఫోన్లు, కారు, నకిలీ కరెన్సీ కట్టలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఉత్తర మండలం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో సైబర్ క్రైం డీసీపీ కవిత, మహంకాళి ఏసీపీ రవీందర్‌లతో కలిసి డీసీపీ చందనా దీప్తి వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్‌కు చెందిన ఓ యువతి భారత్ మ్యాట్రిమోనీలో ప్రకటన ఇవ్వగా...జవేష్ అనే నైజీరియన్ స్పందించాడు. పెళ్లి చేసుకుంటానని, ఎన్ఆర్ఐ బ్రాహ్మణ్ కుటుంబానికి చెందిన వ్యక్తినని చెప్పాడు. బ్రూక్ ఆర్మీ మెడికల్ సెంటర్‌లో కార్డియో థొరాసిక్ సర్జన్‌గా పనిచేస్తున్నానని నమ్మించాడు.తాను ఇండియా రావాలంటే డబ్బు అవసరమని, రాగానే ఇద్దరం పెళ్లి చేసుకుందామని మాయమాటలు చెప్పాడు. అటు తర్వాత తాను ముంబై ఎయిర్‌పోర్టులో దిగానని, విలువైన కొన్ని బహుమతులు తీసుకువచ్చానని కస్టమ్స్ అధికారులకు పన్ను చెల్లించాలని చెప్పి రూ.27.43 లక్షలు అకౌంట్లో వేయించుకున్నాడు. ఆ తర్వాత ఆగస్టు 7వ తేదీన ముంబాయికి చెందిన నైజీరియన్ అలెక్స్ మార్క్ ఒడుడు (44) అనే వ్యక్తి ద్వారా సికింద్రాబాద్‌లోని యువతి ఇంటికి ఓ డిజిటల్ లాకర్‌ను పంపించాడు. దాంట్లో కరెన్సీ ఉందని నమ్మబలికాడు. అయితే లాకర్ నుంచి కెమికల్ వాసన రావడం, జవేశ్ మళ్లీ డబ్బులు అడగడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రంగంలోకి దిగిన పోలీసులు మోసగాడి సహాయకుడు అలెక్స్ మార్క్ ఒడుడును అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన జవేష్ మాత్రం పరారీలో ఉన్నాడు. కాగా మ్యాట్రిమోనీ సంస్థలు వారి వద్దకు వచ్చే వాళ్ల ప్రొఫైల్స్‌ను ఏ మాత్రం పరిశీలించకుండానే వెబ్‌సైట్‌లో ఉంచుతున్నారని, దీని వల్ల అమాయకులు మోసపోతున్నారని డీసీపీ తెలిపారు. ప్రస్తుతం వారికి నోటీసులు ఇస్తామని, అవసరమైతే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

మట్టి గణపతికి జై

మానవాళి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతగానో దోహదపడుతుందని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మట్టి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు..

– సికింద్రాబాద్, సనత్‌నగర్ జోన్ల బృందం


మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ హేమ


మట్టి గణపతి ప్రతిమలు అందజేస్తున్న పద్మారావు గౌడ్


మట్టి వినాయకులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్ర


మట్టి విగ్రహాలు అందజేస్తున్న కొలను లక్ష్మీబాల్‌రెడ్డి


బేగంపేట పాటిగడ్డలో..


మట్టి వినాయకులు పంపిణీ చేస్తున్న జలంధర్‌గౌడ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379